

4279 రేషన్‌కార్డులు మంజూరు

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో గత ఏడాది జులై నుంచి డిసెంబర్ వరకు దరఖాస్తు చేసుకున్న 4270 పేద కుటుంబాలకు రేషన్‌కార్డులు మంజూరైనట్లు కలెక్టర్ నాగలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు.కొత్త కార్డుదారులంతా వారు దరఖాస్తు చేసుకున్న సచివాలయానికి వెళ్లిరేషన్ కార్డులను తీసుకోవాలని తెలిపారు. ఈనెల నుంచి ఎండియు వాహనాల వద్ద రేషన్ తీసుకోవచ్చునని తెలిపారు.

15న స్పందనలు రద్దు

సంక్రాంతి పండగ సందర్భంగా ఈనెల 15న కలెక్టరేట్ ఆడిటోరియం, జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగే స్పందన, జగనన్నకు చెబుదాం కార్యక్రమాలను రద్దు చేస్తున్నట్లు ఎస్‌పి.ఎం.దీపిక, డిఆరఒ ఎస్.డి.అనిత ఒక ప్రకటనలో తెలిపారు.

ఆగని దోపిడీ

- అక్కరకురాని అధికారులు
- కంటతడి పెడుతున్న ధాన్యం రైతులు
- కలెక్టర్‌కు ఫిర్యాదుల వెల్లువ



ధాన్యాన్ని ట్రాక్టర్‌పై మిల్లుకు తరలిస్తున్న రైతులు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలో ధాన్యం క్రయ, విక్రయాల్లో దోపిడీ ఆగడం లేదు. తూకంలో తేడా, ధరలో దగా షరా మామూలుగా సాగుతోంది. దోపిడీని అరికట్టి రైతులకు బాసటగా నిలవాల్సిన ఉన్నతాధికారులు తమకు పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. కొన్నిచోట్ల మిల్లర్లకు వంతపాడుతున్న సందర్భాలూ తారసపడుతున్నారు. దీంతో, తమకు జరుగుతున్న అన్యాయాన్ని ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాక ధాన్యం రైతులు కంటతడి పెడుతున్నారు. కాస్తంత చొరవ ఉన్నవారు కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో ఫిర్యాదులు చేశారు. ప్రతి ధాన్యపు గింజా దళారుల ప్రమేయం లేకుండా కొనుగోలు చేస్తామంటూ ఇటు అధికారులు, అటు ప్రభుత్వం ప్రగల్భాలాలు పలికిన సంగతి తెలిసిందే. ఈ మాటలు కోటలు దాటుతున్నా ఆచరణ మాత్రం గడపదాటడం లేదు.

- గంట్యాడ మండలం బుడతనాపల్లికి చెందిన చల్లా రామునాయుడు కౌలు రైతు. అదే మండలంలోని కనక దుర్గ రైస్ మిల్లుకు 140 బస్తాలు, శ్రీరాధా కృష్ణ ఆగ్రో ఫుడ్స్‌కు 90 బస్తాలు, వెంకటరమణ రైస్‌మిల్లుకు 136 చొప్పున మొత్తం 366 ధాన్యం బస్తాలు విక్రయించాడు. ప్రతి బస్తాలోనూ 42 కేజీల చొప్పున తూకం వేసి, లెక్క మాత్రం 40కేజీలకే కట్టారు. ఈ ఏడాది ప్రభుత్వం నిర్ణయించిన మద్ధతు ధర 40కేజీల బస్తా ధాన్యం 'ఎ'గ్రేడ్ రూ.881.20, సాధారణ రకం రూ.873.20 గా ఉంది. కేజీ సుమారు రూ.22 చొప్పున లెక్కిస్తే రామునాయుడు వద్ద 366 బస్తాలపై ఆయా మిల్లుల యాజమాన్యాలు రూ.8.062 వరకు దోచుకున్నట్టుగా అర్థమౌతోంది. మిల్లు యాజమాన్యాలు తనను నిండా ముంచేశాయంటూ రామునాయుడు ప్రజాశక్తి ఎదుట ఆవేదన వ్యక్తం చేశాడు.

- జామి మండలం తానవరం గ్రామానికి చెందిన సిరికి చంద్రరావు స్థానిక సూర్యరాజా రైస్ మిల్లుకు 6టన్నుల 240కేజీల ధాన్యాన్ని విక్రయించాడు. మిల్లు యాజమాన్యం, ప్రభుత్వ సిబ్బంది చూపుతున్న లెక్క మాత్రం 6టన్నులే. దీన్నిబట్టి టన్నుకు 4కేజీల చొప్పున మినహాయించినట్టు స్పష్టమౌతోంది. ఇదేం అన్యాయం అంటూ మిల్లు యాజమాన్య సిబ్బంది, అక్కడి కస్టోడియన్ ఆఫీసర్లను అడిగితే అందరి వద్దా 2కేజీల నుంచి 4కేజీల వరకు అదనంగా తీసుకుంటారని, తరుగు ఉంటుంది కాబట్టి ఆమాత్రం తప్పదని చెప్పారు. అంతే కాదు. ధాన్యం మొత్తం ఒకేసారి నూర్పుచేసి, ఐదు ట్రాక్టర్లతో తీసుకెళ్లగా ఆర్‌బికె సిబ్బంది పూర్తి తేమశాతం ఉన్నట్టు గుర్తించారు. కానీ, మిల్లు వద్దకు వెళ్లేసరికి ఒక ట్రాక్టర్ లోడుకి తేమ శాతం తక్కువగా ఉన్నట్టుగా చెప్పి ధర తగ్గించారు. ఇతను కూడా తనను కలిసిన ప్రజాశక్తి ఎదుట తీవ్రంగా విలపించాడు. కేవలం రామునాయుడు, చంద్రరావు మాత్రమే కాదు. జిల్లాలో 90శాతం రైతులది ఇదే వ్యథ. ప్రభుత్వానికి విక్రయిస్తే మిల్లర్లు అదనంగా ధాన్యం తీసుకుంటున్నారని, ప్రైవేటు వ్యాపారులకిస్తే రూ.200 తక్కువ ధరకు లాగేస్తున్నారని తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

డిప్యూటీ తహాశీల్దార్ కూడా అదనపు ధాన్యం ఇవ్వాల్సిందే అన్నారు...



ఏం చేస్తాం బాబు... మా బాధలు ఎవరికి చెప్పుకుంటాం... ఎవరికి చెప్పినా మా బాధలు, ఇబ్బందులు పట్టడం లేదు. డిప్యూటీ తహాశీల్దార్‌కు చెబితే ఆయన కూడా అదనపు ధాన్యం ఇవ్వాల్సిందే అన్నారు...మురపాక సూర్యరాజా రైస్ మిల్లుకు 5,900 కేజీలు అప్పగించగా, 5,200కేజీలుగా నమోదు చేశారు. దీనిపై డిఎస్‌ఒకు ఫిర్యాదు చేస్తే ఆయన డిప్యూటీ తహాశీల్దార్ వద్దకు పంపారు. ఆమె వచ్చి నాను న్యాయం చేయాల్సింది పోయి... అందరూ ఆలాగే ఇచ్చేస్తున్నారు... నువ్వు కూడా ఆలాగే ఇచ్చేయ్... ఎందుకొచ్చిన గోల అంటూ నన్నే వెనక్కితగించేందుకు ప్రయత్నించారు. కానీ, నేను మాత్రం అంగీకరించలేదు. కాబట్టి నా దగ్గర తీసుకున్న కేజీల మొత్తానికి బిల్లు ఇప్పించాలని అధికారులను కోరతున్నాను. ఈ మేరకు కలెక్టర్‌కు కూడా జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో ఫిర్యాదు చేశాను. ఆమె ఏమేరకు స్పందిస్తారో? చూడాలి.

భూమిరెడ్డి అప్పారావు
వసాది, గంట్యాడ మండలం



విచారణ చేస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుమబాల

ధాన్యం దోపిడీపై విచారణ

ప్రజాశక్తి - జామి

ధాన్యం కొనుగోలులో జరుగుతున్న అక్రమాలపై విచారణ జరుగుతోంది. ఈ మేరకు జామి, గంట్యాడ మండలాల్లో బాధిత రైతులను స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుమబాల విచారించారు. జామి మండలంలోని జామి, తానవరం, తెలగాపాలెం రైతులను వ్యవసాయ శాఖ కార్యాలయానికి పిలిచి విచారించారు. తమ నుంచి అదనపు ధాన్యంతో పాటు అక్రమ వసూలు కు పాల్పడినట్లు రైతులు విచారణ అధికారి ఎదుట గోడు వినిపించారు. గంట్యాడ మండలం బుడతనాపల్లి రైతులు విచారణకు హాజరై, మిల్లర్లు దోపిడీని వివరించారు. విచారణలో బాధితులు సమర్పించిన ఆధారాలను, మిల్లులకు చెల్లించిన అదనపు ధాన్యం, అక్రమ వసూలు తీరును అధికారులకు వివరించారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు.

అక్రమాలపై కంటి తుడుపు చర్యలు

గంట్యాడ మండలం రాయవలసలోని సూర్యరాజు మిల్లును బ్లాక్ లిస్టులో పెట్టిన విషయం తెలిసిందే. కానీ చర్యలు నామ మాత్రమే అని రైతు సంఘం నాయకులు బుద్దరాజు రాంబాబు అన్నారు. 'ధాన్యం కొనుగోలులో బరితెగింపు' అనే శీర్షిక తో ప్రజాశక్తి లో గత నెలలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై జెసి మయూర అశోక్ స్పందించారు.

ప్రధానంగా అదనపు ధాన్యం డిమాండ్ చేస్తున్నారన్న ఆరోపణల నేపథ్యంలో జిల్లాలోని అన్ని మిల్లులకు కీలక అదేశాలు జారీ చేశారు. మిల్లుల వద్ద ధాన్యం దించకోకుండా జాప్యం చేసే, మిల్లర్ల పై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలోనే పౌర సరఫరాల అధికారులు మిల్లులపై విచారణ జరిపారు. రైతుల నుంచి అదనపు ధాన్యం వసూలు కు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కానీ ఆ హెచ్చరికలు కంటితుడుపు చర్యగానే మారిందన్న ఆరోపణల వినిపిస్తున్నాయి. అన్ని మిల్లులో యదేచ్ఛగా దోపిడీ జరుగుతుందని రైతుల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పోక్సో కేసులో నిందితుడికి 21ఏళ్ల జైలు

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలోని ఎల్.కోట పోలీసు స్టేషనులో 2019 సంవత్సరంలో నమోదైన పోక్సో కేసులో నిందితుడైన వేపాడ మండలం రామస్వామిపేట గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ గుడే కోటేశ్వరరావు (36)కు 21 సంవత్సరాలు కఠిన కారా శిక్ష విధిస్తూ పోక్సో కోర్టు న్యాయమూర్తి కె.నాగమణి గురువారం తీర్పు చెప్పారని ఎస్‌పి ఎం.దీపిక తెలిపారు. రామస్వామిపేటకు చెందిన నిందితుడు గుడే కోటేశ్వరరావు ఒక బాలికపై లైంగిక నేరంకు పాల్పడినట్లుగా బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదుతో ఎల్.కోట పోలీసు స్టేషనులో 2019లో కేసు నమోదైంది. డిఎస్‌పి డి. సూర్య శ్రావణ్ కుమార్ దర్యాప్తు చేపట్టి, నిందితుడిని అరెస్టు చేసి, రిమాండుకు తరలించారు. నేరం రుజువు కావడంతో నిందితుడికి 20ఏళ్ల జైలు శిక్ష, రూ.2వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. అట్రాసిటీ చట్టం సెక్షన్ 3(1)(డబ్ల్యు)(1) ప్రకారం నేరానికి పాల్పడినందుకు ఒక ఏడాది జైలు, రూ. 1000 జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. పోక్సో కేసులో త్వరితగతిన నిందితుడికి శిక్ష పడే విధంగా వ్యవహరించిన దర్యాప్తు అధికారులు, ప్రాసిక్యూషన్ అధికారులను ఎస్‌పి ఈ సందర్భంగా అభినందించారు.

సబ్ జూనియర్ తైక్వాండో పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 21 20 తేదీల్లో కర్నూలు జిల్లా నంద్యాలలో జరుగు 37వ స్టేట్ ఇంటర్ డిస్ట్రిక్ట్ తైక్వాండో పోటీలకు గురువారం విజ్జీ స్టేడియంలో ఎంపికలు జరిగాయి. వైసిపి యువజన విభాగం నాయకులు ఈశ్వర్ కౌశిక్ ప్రారంభించారు. వివిధ మండలాల నుంచి సుమారు 200 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈ పోటీలలో ప్రథమ బహుమతి పొందిన బాల బాలికలు కర్నూలు జిల్లా నంద్యాల రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారరని తెలిపారు. పోటీలకు జిల్లా అధ్యక్షులు చారి, కార్యదర్శి ఎం. త్రినాధ రావు , వైస్ ప్రెసిడెంట్ అనిల్ కుమార్ శర్మ పాల్గొన్నారు.

సంక్రాంతి కిట్లు అమ్మకం

ప్రజాశక్తి-విజయనగరం కోట

సంక్రాంతి సంబరాల్లో భాగంగా డిఆర్‌డిఎ నిర్వహిస్తున్న రైతు ఉత్పత్తి సంఘాల ద్వారా భోగి, సంక్రాంతి కిట్లు తయారుచేసి స్టాల్స్ ద్వారా విక్రయిస్తారని కలెక్టర్ కె.నాగలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. మహిళా రైతులు తయారుచేసిన ఆవుపేడ పిడకలు, పసుపు, కుంకుమ, వేప పుల్లలు, నలుగుపిండి, నువ్వులనూనె, రేగుపళ్ళు, చెరుకుముక్కలు, కొత్త బియ్యం, కొత్త బెల్లం, అగరబత్తీలు, హారతి సెట్ ఒక కిట్టుగా తయారుచేసి విక్రయిస్తారని తెలిపారు. కలగాయ కూరకు అవసరమైన కూరగాయల కిట్టు కూడా విక్రయిస్తారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



అభివాదం చేస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

మున్సిపల్ కార్మికుల సమ్మె తాత్కాలిక విరమణ

- స్థానిక సమస్యలపై కొనసాగుతున్న నిరసన
- జీతాలు, హెల్త్ అలవెన్స్ బకాయిలు చెల్లించాలని డిమాండ్
- అసిస్టెంట్ కమిషనర్‌కు, ఎంఇకి వినతులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మున్సిపల్ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు తాత్కాలికంగా సమ్మెను విరమించామని, అయితే వేతనాలు, హెల్త్ అలవెన్స్ బకాయిలు చెల్లించాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎ.జగన్మోహన్ డిమాండ్ చేశారు. ఈమేరకు కార్పొరేషన్ కార్యాలయం వద్ద గురువారం నిరసన తెలిపారు. ఈసందర్భంగా జగన్మోహన్ మాట్లాడుతూ 16 రోజులుగా సమ్మెలో పాల్గొన్న కార్మికులకు అభినందనలు తెలిపారు. పారిశుధ్య కార్మికులకు జీతం, హెల్త్ అలవెన్స్ కలిపి రూ. 21వేలు బేసిక్ వేతనం, డ్రైవర్లకు రూ.18500 జీతంతో ఆక్యుపెన్సీ హెల్త్ అలవెన్స్ రూ.6వేలు అమలు చేస్తారని తెలిపారు. సమ్మె కాలపు జీతం, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.50వేలు, పదేళ్ళ సర్వీసు పూర్తి చేసిన వారికి రూ.2వేలు అదనపు చెల్లింపు, ప్రమాదవశాత్తు మరణిస్తే 5 లక్షల నుంచి ఏడు లక్షలకు పరిహారం పెంపు, ఇంజనీరింగ్ కార్మికుల సమస్యల పరిశీలనకు కమిటీ ఏర్పాటు చేస్తామని చర్చల సందర్భంగా మంత్రి హామీ ఇచ్చారని తెలిపారు. అయితే స్థానిక సమస్యలపై ఆందోళన కొనసాగుతుందని ప్రకటించారు. అనంతరం సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కే సురేష్, నగర కార్యదర్శి బి రమణతో కలిసి అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావుకు, మున్సిపల్ ఇఇకి బకాయి జీతాలు ,హెల్త్ అలవెన్సు చెల్లించాలని, యూనిఫామ్ కుట్టుకూలి ఇవ్వాలని, పనిముట్లు ,రక్షణ పరికరాలు ఇవ్వాలని వినతి అందజేశారు. బకాయి జీతాల కోసం శుక్రవారం మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తామని ప్రకటించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో మురళి, నారాయణరావు, రాఘవ ,సూరి, లక్ష్మి, వరలక్ష్మి, పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

మరొక్క అవకాశం ఇవ్వండి : కోలగట్ల

ప్రజాశక్తి- విజయనగరం టౌన్

సామాన్యులకు నిరంతరం అందుబాటులో ఉంటూ ఎవ్వరికి ఏ సమస్య వచ్చి తలుపు తట్టినా నేనున్నానని ధైర్యం చెప్పే తనకు వచ్చే ఎన్నికల్లో మరొక అవకాశం ఇవ్వాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ప్రజలను కోరారు. గురువారం సారిపల్లి లో 352 కుటుంబాలకు టిడ్కో గృహాల తాళాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంఎల్‌ఎ గా మరొక్క అవకాశం ఇస్తే సమస్యలు లేని విజయనగరాన్ని చూపిస్తానని, వచ్చేసారి యువతకు ఉద్యోగ కల్పనే ధ్యేయంగా పని చేస్తానని తెలిపారు. సమావేశంలో సహాయ మున్సిపల్ కమిషనర్ ప్రసాద రావు, టిడ్కో ఇఇ అరుణ, మేయర్ విజయలక్ష్మి, వైసిపి నగర అధ్యక్షులు ఆశపు వేణు, హౌసింగ్ కమిటీ సభ్యులు ఎస్‌వి రాజేష్, తవిటి రాజు, మారోజు శ్రీనివాసరావు, గాదం మురళి, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు పాల్గొన్నారు.



టిడ్కో లబ్ధిదారులకు ఇంటి తాళం అప్పగిస్తున్న కోలగట్ల

సామాజిక భవనం ప్రారంభం

నగరంలోని ఒకటో డివిజన్ సాకేటి వీధిలో నూతనంగా నిర్మించిన సామాజిక భవనాన్ని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి ప్రారంభించారు. రూ.14 లక్షలతో నిర్మించిన సామాజిక భవనం స్థానికులకు ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన అన్నారు. అనంతరం మీడియాతో వైసిపి పార్లమెంటరీ పార్టీ ప్రధాన కార్యదర్శి ముద్దాడమధు, జోనల్ ఇన్‌ఛార్జి మచ్చు శ్రీనివాసరావు మాట్లాడుతూ సామాజిక న్యాయానికి సిఎం కట్టుబడ్డారని అన్నారు. ఫ్లోర్ లీడర్ ఎస్ వి వి రాజేష్, కోఆప్షన్ సభ్యులు ముద్దాడ రమణి, వైసిపి నాయకులు, కార్యకర్తలు , స్థానికులు పాల్గొన్నారు.

14,857 మందికి జగనన్న తోడు విడుదల

ప్రజాశక్తి-విజయనగరం

జగనన్న తోడు పథకం ద్వారా ఇస్తున్న రూ.10వేలు అప్పు ద్వారా చిరు వ్యాపారుల్లో ఆత్మ గౌరవాన్ని పెంచుతున్నారని కలెక్టర్ నాగలక్ష్మి పేర్కొన్నారు. చిన్నచిన్న వ్యాపారాలు చేసుకొనే వారికి ఈ పథకం ఎంతగానో ఆదుకుంటోందని ముఖ్యమంత్రి జగన్ మోహనరెడ్డికి వివరించారు. జగనన్న తోడు పథకం కింద 8వ విడతగా జిల్లాలోని సుమారు 14,857 మంది లబ్ధిదారులకు, రూ.15.71 కోట్ల వడ్డీ లేని రుణాన్ని ముఖ్యమంత్రి గురువారం విడుదల చేశారు. తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయం నుంచి నేరుగా బటన్ నొక్కి ఈ మొత్తాన్ని లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. జగనన్న తోడు పథకం కింద 6వ విడతలో రుణం తీసుకున్న 26,320 మంది లబ్ధిదారులకు రూ.54.94లక్షలను వడ్డీ కింద లబ్ధిదారులకు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యక్ష ప్రసారంలో, కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ, జిల్లాలో ఈ పథకం కింద లబ్ధిదారులకు జరిగిన మేలును వివరించారు. ఇప్పటివరకు జిల్లాలో ఏడు విడతల్లో సుమారు 1,06,696 మంది చిరువ్యాపారులు, సంప్రదాయ వృత్తిదారులకు రూ.10వేలు నుంచి రూ.13 వేలు మధ్య దాదాపు రూ.101.12 కోట్లు వరకు వడ్డీలేని రుణాలను మంజూరు చేశామని తెలిపారు. ఇలా రుణాలు పొందిన 1,34,867 మంది చిరువ్యాపారులకు వారి బ్యాంకు ఖాతాల్లో రూ.3.08 కోట్లను వడ్డీ కింద ఐదు విడతల్లో జమ చేశామన్నారు. అనంతరం లబ్ధిదారులకు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపి బెల్లాన చంద్రశేఖర్, రాజాం ఇన్‌ఛార్జి డాక్టర్ తలే రాజేష్, డిఆర్‌డిఎ పీడీ ఎ.కల్యాణచక్రవర్తి, మెప్మా పీడీ సుధాకరరావు, సచివాలయాల నోడల్ ఆఫీసర్ నిర్మలాదేవి, డిఆర్‌డిఎ సిబ్బంది, లబ్ధదారులు పాల్గొన్నారు.

బెల్లాన భవితవ్యం ఏమిటో?


ఎంపీ సీటు ఆశించవద్దన్న అధిష్టానం
ఎమ్మెల్సీ లేదా జెడ్‌పి పీఠం ఇస్తామని హామీ!

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి



విజయనగరం ఎంపి బెల్లాన చంద్రశేఖర్ భవితవ్యం ప్రశ్నార్థకంగా మారుతోంది. ఈ సారి ఎంపి సీటు వదులుకోవాలంటూ నాలుగు రోజుల క్రితమే నేరుగా ఆదిష్టానం తేల్చి చెప్పినట్టు సమాచారం. ఈసారికి పార్టీ కోసం పనిచేయాలని, తిరిగి అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్సీ లేదా ఏదైనా పదవి కట్టబెడతామని హామీ ఇచ్చినట్టుగా తెలుస్తోంది. దీంతో, ఆ రోజు నుంచి బెల్లాన మౌనంగా ఉంటున్నారు. మరోవైపు మంత్రి బొత్స కూడా బెల్లానను వీలైనంత వరకు ఎచ్చెర్ల నుంచి అవకాశం కల్పించేటట్టు చూస్తున్నారని, అదీ కాకపోతే విజయనగరం ఎంపీగా మజ్జి శ్రీనివాసరావు వెళ్తే జిల్లా పరిషత్ ఛైర్మన్ పదవి కట్టబెట్టడం వంటి ఆలోచన చేస్తున్నారని రాజకీయ నాయకులు విశ్లేషిస్తున్నారు. బొత్స ప్రయత్నం ఎంత వరకు ఫలిస్తుందో చూడాల్సివుంది. ఎచ్చెర్లలో అవకాశం ఇవ్వడం లేదా ఇవ్వకపోవడం అనేది పూర్తిగా అధినేత జగన్ మనసులో మాటేనని, ఆ నియోజకవర్గం విజయనగరం జిల్లాలో లేదు కాబట్టి బొత్స చెప్తే అయ్యే పరిస్థితి లేదని కూడా కొంతమంది వ్యాఖ్యానిస్తున్నారు. ఈనేపథ్యంలో ఎన్నికల ముందు బెల్లాన ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో అన్న ఆశక్తికర చర్చ నడుస్తోంది. బెల్లానకు చీపురుపల్లి నియోజకవర్గంలో మంచి పట్టుంది. అందుకే వైసిపి మొదటి ఎన్నికల్లో మంత్రి బొత్స, మాజీ మంత్రి కిమిడి మృణాళినిపై నుంచి పోటీచేశారు. అంతకు ముందు జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా కూడా పనిచేశారు. తిరిగి గత ఎన్నికల్లో బొత్స వైసిపిలోకి రావడంతో వైసిపి అధిష్టానం బెల్లానను పార్లమెంట్ స్థానానికి పంపింది. దీంతో, బొత్స విజయం కూడా సునాయాశమైంది. ఈసారి బెల్లానకు రాజకీయ భవిష్యత్తు చూపకుండా బొత్స ఎన్నికల్లో దిగితే పరిమాణాలు ఎలా ఉంటాయో అన్న ఆశక్తికరమైన చర్చ కూడా నడుస్తోంది. ఈనేపథ్యంలో ఒక వేళ జెడ్‌పి ఛైర్మన్ శ్రీనివాసరావు పార్లమెంట్ స్థానం నుంచి పోటీకి దిగితే ఆస్థానం బెల్లానకు కట్టబెట్టాలని బలంగా ఆలోచిస్తున్నట్టుగా చర్చ నడుస్తోంది. ఒకే దెబ్బకు రెండు పిట్టలు అన్నట్టుగా బెల్లానకు అలా సాయపడితే ఎన్నికల్లో బొత్స సునాయాశంగా ఒడ్డు ఎక్కడంతోపాటు జిల్లాపై మజ్జి శ్రీనివాసరావు హవాకు అడ్డుకట్టవేసినట్టుగా కూడా ఉంటుందని భావిస్తున్నట్టు సమాచారం. మరోవైపు ఎచ్చెర్ల నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్‌కు టిక్కెట్ ఉంటుందా? ఊడుతుందా? అన్న సందేహాలు సాగుతున్నాయి. ఈనేపథ్యంలో బెల్లానకు ఆ సీటు కోసం బొత్స ప్రయత్నాలు చేస్తున్నట్టుగా చర్చ నడుస్తోంది.

31వ రోజుకు చేరిన అంగన్వాడీల సమ్మె



కొత్తవలస : పొర్లుదండాలు పెడుతున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన అంగన్వాడీలు చేపట్టిన సమ్మె 31వ రోజుకు చేరుకుంది. ప్రభుత్వం దున్నపోతుపై వర్షం పడిన చందాన వ్యవహరిస్తున్నా అంగన్వాడీలంతా సమ్మె కొనసాగిస్తూ వినూత్న రూపాల్లో ప్రభుత్వానికి తమ నిరసన తెలుపుతున్నారు.

ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన దీక్ష కొనసాగించారు వీరి పోరాటానికి ఆర్టీసి స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకులు వి.రాములు ఆధ్వర్యంలో యూనియన్ నాయకులు మద్దతు తెలిపారు. రూ.8,500 పోరాట నిధిని అందచేశారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించాల్సిన ప్రభుత్వం ఎస్మా చట్టాలతో బెదిరింపులకు పాల్పడటం సరైంది కాదన్నారు. సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ లు చేసే న్యాయమైన పోరాటానికి అండగా ఉంటామన్నారు. యూనియన్ జిల్లా అధ్యక్షులుపైడిరాజు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గజపతినగరం : సమ్మె శిబిరంలో మోకాళ్లపై నిల్చొని నిరసన తెలిపారు. ప్రభుత్వం మొండి వైఖరి వీడి సమస్యలు పరిష్కరించాలని నినదించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు వి.లక్ష్మి, ప్రాజెక్ట్ అధ్యక్షులు సుభాషిని, సెక్టార్ నాయకులు రమణమ్మ రాములమ్మ సన్యాసమ్మ వాణి సుజాత జ్యోతి తదితరులు పాల్గొన్నారు

శృంగవరపుకోట : పట్టణంలోని ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు నెత్తిపై కుర్చీలు పెట్టుకుని నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ, ప్రాజెక్టు లీడర్ డి శ్యామల, డి.జయలక్ష్మి, జి. క్రాంతి, వి.మాణిక్యం, డి.సుశీల, వి. దుర్గాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి : ప్రభుత్వం తీరుపై అంగన్వాడీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్వాడీలకు ప్రభుత్వం పోస్టల్ ద్వారా నోటీసులు పంపింది. నిరసన శిబిరం వద్దకు పోస్ట్‌మెన్లు నోటీసులు ఇచ్చేందుకు రాగా తీసుకునేందుకు అంగన్వాడీలు నిరాకరించడంతో పోస్ట్‌మెన్లు వెనుదిరిగారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు, అంగన్వాడీ యూనియన్ నాయకులు కామేశ్వరి మాట్లాడుతూ ఎన్నికల హామీలను అమలు చేయాలని నెల రోజులుగా సమ్మె చేస్తే హామీలను అమలు చేయకుండా నోటీసులు పంపడం దుర్మార్గమన్నారు. అంగన్వాడీలపై కక్షసాధింపు చర్యలు మానుకొని హామీలను అమలు చేయాలని కోరారు.

కొత్తవలస : కొత్తవలసలో పొర్లు దండాలు పెడుతూ నిరసన తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి మంచి మనసు ప్రసాదించాలని దేవుని ప్రార్థిస్తూ దండాలు పెట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడీలు సమ్మె చేపట్టి నెల రోజులు కావస్తున్న ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమని అన్నారు.కార్యక్రమంలో అంగన్వాడీ వియ్యంపేట ప్రోజెక్టు అధ్యక్షురాలు కాకర తులసి, శంకరావతి, సిఐటియు నాయుకులు గాడి.అప్పారావు, అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

భోగాపురం : హక్కుల కోసం సమ్మె చేస్తున్న అంగన్వాడీ లపై ఎస్మా ప్రయోగించడం దారుణమని జనసేన నియోజకవర్గం ఇంఛార్జి లోకం మాధవి అన్నారు. తాహశీల్దార్ కార్యాలయం వద్ద సమ్మె చేస్తున్న అంగన్వాడీలకు సంఘీభావం తెలిపారు.పనికి తగిన వేతనం చెల్లించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ సందర్భంగా సమ్మె చేస్తున్న అంగన్వాడీల నిధికి తన వంతు సహాయం అందజేశారు. సిఐటియు నాయకులు బి సూర్యనారాయణ, నాయకులు కృష్ణవేణి, కొర్లమ్మ, అనిత, ప్రవీణ, అనిత, శ్రీదేవి పాల్గొన్నారు. **గంట్యాడ :** యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి అనసూయ ఆధ్వర్యాన సమ్మె కొనసాగింది. అంగన్వాడీలంతా మౌనం పాటిస్తూ నిరసన తెలిపారు.



బొబ్బిలి : పోస్ట్‌మెన్ నుంచి నోటీసులు తీసుకునేందుకు నిరాకరిస్తున్న నాయకులు



భోగాపురం : సమ్మెకు సంఘీభావం తెలుపుతున్న జనసేన నాయకురాలు మాధవి

13న మండల స్థాయి ముగ్గుల పోటీ

వేపాడ : ఈ నెల 13న మండల స్థాయిలో ముగ్గులు పోటీలు నిర్వహిస్తామని టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలో శనివారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు మహిళలకు ముగ్గులు పోటీ నిర్వహిస్తామన్నారు. గెలిపొందిన ఐదుగురుకు బహుమతులు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. మండల స్థాయిలో గెలిపొందిన వారిని నియోజకవర్గ స్థాయికి ఎంపిక చేస్తామని మహిళలంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కొత్తవలస: సంక్రాంతి సంబరాల్లో భాగంగా టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ ఆధ్వర్యంలో ఈనెల 13న కొత్తవలసలో మండల స్థాయి ముగ్గుల పోటీలను నిర్వహించనున్నట్లు టిడిపి మండల అధ్యక్షులు గొరపల్లి రాము తెలిపారు. స్థానిక టిడిపి కార్యాలయంలో ఆయన గురువారం విలేకర్లతో మాట్లాడారు. ఈ అవకాశాన్ని మహిళలు వినియోగించుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఆయన వెంట పార్టీ ముఖ్య నాయకులు ఉన్నారు.

వాహన తనిఖీలు తప్పనిసరి

రేగిడి: చెక్‌పోస్టుల వద్ద వాహనాలను తప్పనిసరిగా తనిఖీ చేయాలని చీపురపల్లి డిఎస్‌పి పి. శ్రీనివాస చక్రవర్తి తెలిపారు. మండలంలోని సంకిలి గ్రామ సమీపం నాగావళి వంతెన వద్ద గురువారం చెక్ పోస్ట్ ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో జిల్లా ఎస్‌పి ఆదేశాల మేరకు ఆయా కూడలి, జిల్లాల బోర్డర్ల వద్ద చెక్ పోస్టులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మత్తుపదార్థాలు, పానీయాలు, నగదు వంటివి రాకపోకలు జరగనున్న సందర్భంగా చెక్ పోస్ట్‌లు వద్ద ప్రస్తుతం ఉదయం, సాయంత్రం తనిఖీలు ఉంటాయని అన్నారు. రానున్న ఎన్నికల సమయంలో 24 గంటలూ పక్కాగా తనిఖీలు చేయాలని సూచించారు. ఆయనతో పాటు రాజాం రూరల్ సిఐ ఉపేంద్ర, ఎస్‌ఐ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

వేపాడ: మండల కేంద్రంలోని సచివాలయంలో గురువారం పిహెచ్‌సి వైద్యులు నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ వైద్య శిబిరంలో 156 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో వైద్యులు ఎ.చంద్రశేఖర్, పి.మధుబాల, కె.బాలాజీ, ఎం.వేణు, పి.వెంకటసాయి కిరణ్ రోగులకు వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అర్జునమ్మ, గాడి గంగ తల్లి, ఎంపిటిసి నారాయణమూర్తి, ఎం. రమణ, ముత్యాల నాయుడు మాస్టర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులుగా గణేష్

జామి: ఎన్‌ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులుగా సుంకరి గణేష్ నియమితులయ్యారు. వీరికి విజయవాడ ఆంధ్ర రత్న భవన్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఎన్‌ఎస్‌యుఐ రాష్ట్ర అధ్యక్షులు నాగమధు యాదవ్ గురువారం ధ్రువ పత్రం అందజేశారు. డిసిసి అధ్యక్షులు సరడం రమేష్ కుమార్ ఆధ్వర్యంలో మండలంలోని భీమిసింగి గ్రామానికి చెందిన సుంకరి గణేష్ కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంస్థగా ఉన్న నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షులుగా ఎన్నికవడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా సుంకరి గణేష్ మాట్లాడుతూ తనకు ఈ అవకాశం కల్పించిన ఎన్‌ఎస్‌యుఐ రాష్ట్ర అధ్యక్షులు నాగమధు, డిసిసి అధ్యక్షులు రమేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్‌ఐ సురేంద్రకు సన్మానం

రామభద్రపురం: అనతి కాలంలోనే ఉత్తమ పోలీసుగా గుర్తింపు పొంది బదిలీపై వెళుతున్న ఎస్‌ఐ సురేంద్ర నాయుడుకు ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షుడు సుధాకర్ మాదిగ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. స్థానిక పోలీస్ స్టేషన్లో ఎస్‌ఐకు పూలమాల వేసి దుస్సాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ విధి నిర్వహణలో ఎనలేని సేవలు చేస్తూ అన్ని సామాజిక, రాజకీయ వర్గాల వారిని తనదైన శైలిలో గౌరవించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ సభ్యులు విజయచంద్ర, కిల్లాడ సురేష్, రాజు పాల్గొన్నారు

ఘనంగా యువజన దినోత్సవం

విజయనగరం టౌన్: జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో చేయూత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా స్వచ్ఛంద సేవాసంస్థల సన్మాన కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా ఎస్‌సి కమిషన్ ఛైర్మన్ డివిజి శంకర్రావు, మజ్జి సరిసహస్ర పాల్గొన్నారు. అనంతరం జిల్లా వ్యాప్తంగా ఉన్న పలు స్వచ్ఛంద సంస్థలకు సన్మానం చేశారు. కార్యక్రమంలో జెడ్‌పి సిఇఒ రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

'ధవళకు' సత్కారం

నెల్లిమర్ల: మండలంలోని మొయిద గ్రామానికి చెందిన ధవళ లక్ష్మణ రావు, జరజాపుపేటకు చెందిన పోలుబోతు దుర్గాప్రసాద్ సేవా కార్యక్రమాలు చేపడుతున్నారని గుర్తించి గురువారం జాతీయ యువజన వారోత్సవాల్లో భాగంగా సత్కరించారు. జెడ్‌పి సమావేశ భవనంలో జరిగిన జాతీయ యువజన వారోత్సవాల సందర్భంగా చేయుత ఫౌండేషన్ అధ్యక్షుడు ఎం రాము అధ్యక్షత ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ డివిజి శంకర రావు చేతులు మీదుగా సత్కరించారు.

కల్లుగీత కార్మిక సంఘం కమిటీ ఎన్నిక

విజయనగరం టౌన్: ఎపి కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కమిటీ నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా జమ్మల అప్పారావు, సిమ్మ అప్పారావు ఎన్నికయ్యారు. గురువారం ప్రజా సంఘాలు కార్యాలయంలో జరిగిన జిల్లా విస్తత స్థాయి సమావేశంలో మొత్తం 26 మందితో నూతన జిల్లా కమిటీ ఎన్నికయింది. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ రాష్ట్ర మహాసభలు జనవరి 30,31 తేదీల్లో తణుకులో జరగనున్నాయని, ఈ జిల్లా నుంచి అధిక సంఖ్యలో గీత కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో గౌరవ అధ్యక్షులు బి.కనకేశ్వర రావు, కొలుసు శ్రీనివాసరావు, ముంత అప్పలస్వామి, డి.బంగారయ్య, పి.వెంకటేష్, సిహెచ్ అప్పన్న, దేముడు, కె.వెంకటరమణ, కె.రామారావు, ఎన్.సూర్యనారాయణ, పాల్గొన్నారు.

రైతులకు మెరుగైన సేవలు

విజయనగరం టౌన్: రైతులకు మెరుగైన సేవలు అందిస్తున్నట్లు డిసిఎంఎస్ ఛైర్‌పర్సన్ అవనాపు భావన తెలిపారు. గురువారం డిసిఎంఎస్ కార్యాలయంలో ఆమె విలేకర్లతో మాట్లాడారు. మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ డిసిఎంఎస్ ద్వారా రైతులకు చేదోడుగా అత్యధిక టర్నోవర్ సాధిస్తున్నామన్నారు. రైతులు పండించిన ఆర్గానిక్ పంటలకు, మిల్లెట్ ప్రొడక్ట్స్‌కు ఇటీవల మొబైల్ వ్యాన్ ద్వారా విజయవంతంగా మార్కెటింగ్ కల్పించామని తెలిపారు. సమావేశంలో వైసిపి నాయకులు అవనాపు విక్రమ్ పాల్గొన్నారు.

జయహో బిసి వాహనం ప్రారంభం

విజయనగరం కోట: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న జయహో బిసి కార్యక్రమం గురించి ప్రత్యేకంగా రూపొందించిన వాహనాన్ని గురువారం అశోక్ బంగ్లా టిడిపి కార్యాలయంలో పార్లమెంట్ పార్టీ అధ్యక్షులు కిమిడి నాగార్జున , నియోజకవర్గ ఇంచార్జ్ అదితి గజపతి రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ వాహనం ద్వారా అన్ని మండలాలలో బిసి సదస్సులు నిర్వహించి వారిలో చైతన్యం తీసుకువస్తామన్నారు. వైసిపి పాలనా వైఫల్యాలను, టిడిపి ప్రభుత్వం బిసిలకు గతంలో చేసిన మంచిని, రాబోయే కాలంలో చేయబోయే లక్ష్యాలను వివరిస్తారని తెలిపారు.

రాజకీయాలకు అతీతంగా పథకాలు

ప్రజాశక్తి- బొబ్బిలి

రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు మున్సిపల్ ఛైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ అన్నారు. మల్లమ్మపేటలో గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. రానున్న ఎన్నికల్లో సీఎం జగన్మోహన్ రెడ్డికి అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు తెంటు పార్వతి, కె.రామారావు, వైసిపి నాయకులు పి.చినవెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి- డెంకాడ

లెండి ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఏటా సంక్రాంతి ముందు మన సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు విశ్వాసాలకు దగ్గరగా యువతను నడిపే దిశగా లెండి కళాశాలలోని కళా వేదిక పై సంస్థ ఫెమినా వింగ్, ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. రంగవల్లికలు, భోగి మంట, పిండి వంటలు, సంప్రదాయ వేషధారణలు, కోలాటాలు, హరిదాసు నామ సంకీర్తనలు, గాలిపటాలు, పడతుల వుత్సాహ బరిత నాట్యాలు అంబరాన్నంటాయి. కళాశాల ఛైర్మన్ పెద్దిరెడ్డి మధుసూదన రావు, సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ కోడూరు శివ రామకృష్ణ, ప్రిన్సిపల్ డాక్టర్ వివి రామారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ హరిబాబు తమ్మినేని, ప్లేస్మెంట్ డీన్ జీ ప్రకాష్ బాబు పాల్గొని మాట్లాడారు. తమ సంస్థ ఎల్లప్పుడూ విలువలతో కూడిన విద్యాభ్యాసం కోసం కృషి చేస్తుందన్నారు. ఈ సంవత్సరం కొత్తగా ప్రపంచ స్థాయి కి దీటుగా ప్రయోగశాలలు నిర్మించినట్లు తెలియజేశారు. విద్యతో బాటు ఉద్యోగ ఉపాధి కల్పనలో ప్రస్తుత పరిస్థితుల్లో కూడా తమ సంస్థ ముందుకు వెళ్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఫెనినా వింగ్ కోఆర్డినేటర్ డాక్టర్ జానకి, సీనియర్ ఆచార్యులు డాక్టర్ దుర్గా శైలజ, డాక్టర్ తిరుమల, విద్యార్థులు పాల్గొన్నారు.

బొండపల్లి: మండలంలోని గొట్లాం గాయత్రీ టెక్నో స్కూలు, శ్రీగాయత్రి జూనియర్ కళాశాలలో గురువారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు వేసిన హరిదాసు, గోదాదేవి, సంక్రాంతి లక్ష్మి, రైతు, జవాను, సోదమ్మ, శకుంతల వేశధారణలు ఆకట్టుకున్నాయి. పతాంగులు, ముగ్గుల పోటీలను యాజమాన్యం తరుపున డైరెక్టర్ జి.ఎరుకునాయుడు ప్రారంభించారు. అనంతరం భోగిమంటలను వేసి విజేతలకు డైరెక్టర్, కరస్పాండెంట్ అండ్ సెక్రటరీ జి. జగదీశ్వరి చేతులు మీదుగా బహుమతులు ప్రదానం చేశారు.



డెంకాడ : లెండి కళాశాలలో నృత్యం చేస్తున్న విద్యార్థులు



బొండపల్లి : విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న డైరెక్టర్ ఎరుకునాయుడు

సంక్రాంతిని ఆనందంగా జరుపుకోవాలి

రామభద్రపురం: సంక్రాంతి పండుగను ప్రజలంతా ఆనందంగా సుఖ సంతోషాలతో జరుపుకోవాలని సిఐ తిరుమలరావు తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ సురేంద్ర నాయుడు ఆధ్వర్యాన విలేకరులతో మాట్లాడుతూ పండగ వేళ దూర ప్రాంతాలకు వెళ్లే వారు ముందుగా సమాచారం ఇస్తే గస్తీ ఏర్పాట్లు చేస్తామన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని కోరారు. జూదం, కోడి, గుర్రెం పందేలు నిషేదం అని ఎవరైనా ఆడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమ మద్యం, గొలుసు దుకాణాలు ఏర్పాటుపై నిఘా ఉంచామన్నారు. బహిరంగ మద్యపానం, డ్రంక్ అండ్ డ్రైవ్, పరిమితికి మించిన వేగంతో ప్రయాణాలు చేస్తే కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

సంక్రాంతి విశిష్టత, సాంప్రదాయం గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సంక్రాంతి సందడి

ప్రజాశక్తి- రేగిడి

హిందువుల ముఖ్యమైన పెద్ద పండుగ సంక్రాంతి వారం రోజులు ముందుగానే ప్రజలు పండగకు గృహాలు అలంకరించుకుని సిద్ధపడతారు. దీంతో పల్లెలలో సందడి వాతావరణం నెలకొంటుంది. మండలంలోని 39 గ్రామ పంచాయతీలో హిందువులలో పెద్ద పండగ అయినా సంక్రాంతికి వలస కూలీలు, ఉద్యోగులు స్వగ్రామాలకు చేరుకుంటున్నారు. ఈ నెల 14, 15,16 సంక్రాంతి పండగలో భాగంగా విశాఖపట్నం, హైదరాబాదు, చెన్నై, బెంగళూరు వంటి పట్టణాలలో ఈ ప్రాంతానికి చెందిన వలస కూలీలు, ఉద్యోగులు తమ స్వగ్రామాలకు చేరుకొని సందడిగా కనిపిస్తున్నారు. కుటుంబ సమేతం, స్నేహితులతో ఆప్యాయత, అనురాగాలతో కనిపిస్తున్నారు. డూడు బసవన్నలతో డప్పు వాయిద్యాలు మారు మోగుతూ కుటుంబ తరతరాల పెద్దలతో పొగుడుతూ బసవన్నలు సందడి చేస్తున్నాయి. హరి దాసులు గ్రామాల్లోకి చేరుకొని సందడి చేస్తూ, హరి కీర్తనలతో అందరినీ అలరిస్తున్నారు. ఇతర ప్రాంతాలకు వలసలు నిమిత్తం వెళ్లిన వారంతా పండగకు స్వగ్రామాలకు రావడంతో గ్రామాల్లో పండగ వాతావరణ నెలకొంది.



గ్రామాల్లో తిరుగుతున్న హరిదాసు

ధాన్యం కొనుగోలులో ఇబ్బందులుంటే చెప్పండి

ప్రజాశక్తి - వేపాడ

ధాన్యం కొనుగోళ్లలో ఎటువంటి సమస్యలున్నా వెంటనే తమకు తెలియజేయాలని జిల్లా వ్యవసాయాధికారి విటి రామారావు అన్నారు. మండలంలో వావిలిపాడు, ఎస్‌కేఆర్ఎస్ పురం గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రంపై వచ్చిన ఫిర్యాదులపై ఆయా కేంద్రాలను గురువారం ఆయన పరిశీలించారు. కొనుగోళ్లపై రైతులను అడిగి తెలుసుకున్నారు. మండలంలో ఒకే ఒక ధాన్యం కొనుగోలు మిల్లు ఉండడం వల్ల సమస్యలు వస్తున్నాయని, రైతుల పండించిన ధాన్యాన్ని మిల్లు వద్దకు తరలించాలంటే రవాణా సౌకర్యం సరిగా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ఈనేపథ్యంలో రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేయలేకపోతున్నామని ఎఒ యశ్వంత్ జిల్లా అధికారికి వివరించారు. ధాన్యం ఆడితే ముక్క అవుతుందన్న కారణంతో కొంత మంది రైతుల వద్ద నుంచి అధికారులు ధాన్యం కొనుగోలు చేయడంలేదని రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విజయనగరం జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఈ రెండు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఇందులో భాగంగా ధాన్యాన్ని చేతితో నలిపి చూడగా బాగానే ఉన్నాయని నిర్ధారించారు. అనంతరం ఆర్ఎస్ పేటలో గల రైస్ మిల్లును పరిశీలించారు. మిల్లర్లు కావాలనే రైతులను మోసం చేస్తున్నారని మిల్లు యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మిల్లు ఓనర్‌ని బ్యాంకు గ్యారంటీ కట్టమని తెలిపారు. మండలానికి ట్యాగ్ చేసిన ఆర్ఎస్‌పేట, సోంపురం, పిల్లగ్రహారం మిల్లులకు బ్యాంక్ గ్యారంటీ లేనందున జిల్లాలోని మెరకముడుదాం, గరివిడి, చీపురుపల్లి, తెర్లాం, గంట్యాడ, బొబ్బిలి, నెల్లిమర్లలో బ్యాంక్ గ్యారంటీ ఉన్న మిల్లులకు డిఎస్ఒ ట్యాప్ చేయించారని అంత దూరం ధాన్యం తరలించడం వల్ల రవాణా ఖర్చులు తడిచిమోపడవుతాయని రైతులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. మండలానికి 14,865 క్వింటాలు టార్గెట్ ఇప్పటి వరకూ 4 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేశారని ఇంకా ఎనిమిది వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాల్సి ఉందని జిల్లా అధికారులకు ఎఒ తెలిపారు. ఆ పరిశీలనలో జిల్లా వ్యవసాయ అధికారి రామారావుతో ఎడిఎ ఎల్ విజయ, తహశీల్దార్ ప్రశాంత్ కుమార్, సిఎస్‌డిటి ఇందిరా, విఎఎలు, సిఇఒ పిల్ల అప్పారావు, లక్ష్మీ నాయుడు పాల్గొన్నారు.

సమస్యలపై రైతులను అడిగి తెలుసుకున్న జిల్లా అధికారులు



ధాన్యాన్ని పరిశీలిస్తున్న జిల్లా అధికారులు

సామాజిక న్యాయానికి ప్రతీకగా అంబేద్కర్ స్మృతి వనం

విజయనగరం టౌన్: రాష్ట్రంలో సామాజిక న్యాయానికి ప్రతీక అంబేద్కర్ స్మృతి వనం అని జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 19న సిఎం జగన్ చేతుల మీదుగా విజయవాడ నడిబొడ్డున రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ 125 అడుగుల విగ్రహ ఆవిష్కరణ జరగనున్నదని తెలిపారు. ఈ సందర్భంగా సామాజిక న్యాయ మహాశిల్పం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ స్మృతి వనం పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నుంచి భారీగా తరలి వెళ్లేందుకు సన్నాహాలు చేపడుతున్నామని తెలిపారు. బొబ్బిలి నియోజకవర్గంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రా కదలిరా కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన కరువైందని విమర్శించారు. 2024 ఎన్నికలలో జగన్ సునామీలో ఫ్యాన్ ప్రభంజనం సష్టించబోతుందని అన్నారు.

చంద్రబాబు మాటల్లో వాస్తవం ఉండదు

ప్రజాశక్తి- బొబ్బిలి

టిడిపి అధినేత చంద్రబాబు మాటల్లో వాస్తవం ఉండదని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. వైసిపి కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నేతి బీరకాయలో నెయ్యి ఉండకపోవడం ఎంత నిజమో చంద్రబాబు మాటల్లో నిజం ఉండకపోవడం అంత వాస్తవమని ఎద్దేవా చేశారు. తోటపల్లి ప్రాజెక్టును పూర్తి చేసి రైతులకు సాగునీరు ఇచ్చిన ఘనత వైసిపికే దక్కిందన్నారు. భోగాపురం ఎయిర్ పోర్టు నిర్మాణానికి అనుమతులు లేకుండా శంకుస్థాపన చేయడం వల్లనే అప్పటి విమానయాన శాఖామంత్రి అశోక్ శంకుస్థాపనకు రాలేదన్నారు. సాగునీటి ప్రాజెక్టులకు రూ.1600 కోట్లు ఖర్చు చేశామన్నారని, ఎక్కడ ఖర్చు చేశారో చెప్పాలని ప్రశ్నించారు. పట్టాదారు పాసు పుస్తకాలు, సర్వే రాళ్ల మీద జగన్ ఫోటోలు పెట్టుకున్నారని చెపుతున్న చంద్రబాబు ఆడపిల్లలకు సైకిళపైన, రేషన్ కార్డులుపైన చంద్రబాబు ఫోటో ఎందుకు పెట్టుకున్నారో చెప్పాలని ప్రశ్నించారు. 2014లో ఒక అవకాశం ఇస్తే ప్రజలను మోసం చేశారని, మరల చంద్రబాబును నమ్మే స్థితిలో ప్రజలు లేరన్నారు. రాష్ట్రంలో అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు మూడు రాజధానులు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్రజల వద్దకు పాలన అందించేందుకు సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చాంన్నారు. అవినీతి రహిత పాలన అందిస్తున్న ఘనత సీఎం జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. బాబు వస్తే జాబ్ వస్తాదని హామీ ఇచ్చి నిరుద్యోగ యువతను మోసం చేశారని గుర్తుచేశారు. తాము అధికారంలోకి వచ్చిన తరువాత సచివాలయాల్లో 1.60లక్షల మందికి ఉపాధి అవకాశాలు కల్పించినట్లు చెప్పారు. తాను భూకబ్జాలు చేసినట్లు నిరూపిస్తే దేనికైనా సిద్ధమని సవాల్ విసిరారు. పొత్తులు లేకుండా ఎన్నికల్లో పోటీ చేసే సత్తా ఉందా అని ప్రశ్నించారు. బొబ్బిలిలో వైసిపి విజయం సాధిం చడం ఖాయమని జోస్యం పలికారు. ఈ సమావేశంలో మున్సిపల్ ఛైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, వైస్ ఛైర్మన్ చెలికాని మురళి, వైసిపి పట్టణ అధ్యక్షులు చోడిగంజి రమేష్ నాయుడు, సీనియర్ నాయకులు శంబంగి వేణుగోపాల నాయుడు, ఇంటి గోపాలరావు, జెసిఎస్ కన్వీనర్ విస్సు పాల్గొన్నారు.

వైసిపి బిసిలను బానిసలుగా మార్చింది

ప్రజాశక్తి - పూసపాటిరేగ

ఈ ముఖ్యమంత్రి బీసీలను బానిసలుగా మార్చేశాడని, పదవులు ఉన్నా పవర్ ఇవ్వడం లేదని నెల్లిమర్ల టిడిపి నియోజకవర్గ ఇంచార్జ్ కర్రోతు బంగారాజు అన్నారు. బిసిలపై విజయసాయి రెడ్డి, వైవీ సుబ్బారెడ్డిల పెత్తనంపై గురువారం మండలంలోని రెల్లివలసలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపిలో బీసీ నేతలకు, ప్రజలకు గౌరవం లేదన్నారు. పెద్దిరెడ్డి, విజయసాయిరెడ్డి, సుబ్బారెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి ముందు బానిసలుగా మార్చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మహంతి చిన్నం నాయుడు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి పతివాడ తమ్మినాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు మహంతి శంకర్రావు, నాయకులు పతివాడ అప్పలనాయుడు, ఇజ్జురోతు ఈశ్వర్రావు పాల్గొన్నారు.

గంట్యాడ: బొబ్బిలిలో ఏర్పాటు చేసిన రా కదలిరా సభ విజయవంతమైందని మాజీ ఎమ్మెల్యే గజపతినగరం నియోజకవర్గ ఇన్చార్జి కొండపల్లి అప్పలనాయుడు అన్నారు. గురువారం గంట్యాడలోని టిడిపి కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. రా కదలిరా సభకు ఉమ్మడి జిల్లా నుండి రెండు లక్షల మంది, గజపతినగరం నియోజవర్గం నుండి 20వేల మంది హాజరై విజయవంతం చేశారని అన్నారు. సహకరించిన నాయకులకు కార్యకర్తలకు, ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. టిడిపితోనే బీసీలకు అభ్యున్నతి కలుగుతుందని చెప్పారు. వైసిపిలో బీసీ నేతలకు, ప్రజలకు గౌరవం లేదన్నారు. పెద్దరెడ్డి, విజయసాయిరెడ్డి, సుబ్బారెడ్డి, సజ్జల ముందు బానిసలుగా తలవంచమని చెప్పడం వల్లనే బీసీ నాయకులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారన్నారు. కర్నూలు ఎంపి డాక్టర్ సంజీవ్ లాగే మరి కొద్ది రోజులలో చాలామంది బీసీ నాయకులు వైసిపిని వదిలివేయడానికి సిద్ధంగా ఉన్నారని జోష్యం పలికారు. రాష్ట్రంలో జగన్ రెడ్డి పాలన మొదలుపెట్టినప్పటి నుండి బిసి సామాజిక వర్గానికి తీరని నష్టం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో టిడిపి మండల అధ్యక్షులు కొండపల్లి భాస్కర నాయుడు, క్లస్టర్ ఇన్చార్జి మల్లి విజయ్ కుమార్, తెలుగు యువత పార్లమెంట్ అధ్యక్షులు వేమలి చైతన్య బాబు, రంది చినరామ నాయుడు, బూడి అప్పలనాయుడు, రొంగల కృష్ణ పాల్గొన్నారు.

పథకాల అమల్లో ప్రభుత్వ లక్ష్యం నెరవేరాలి

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పథకాల అమలులో ప్రభుత్వ లక్ష్యం నెరవేరాలని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జనవరి, ఫిబ్రవరిలో చేపట్టనున్న వైఎస్ఆర్ ఆసరా, వైఎస్ఆర్ చేయూత పథకాలను పకడ్బందీగా అమలకు తీసుకోవాల్సిన చర్యలు, ప్రభుత్వ ఆదేశాల అమలుపై డిఆర్‌డిఎ-వైయస్సార్ కాంతి పథకం మండల శాఖాధికారులు, క్షేత్రస్థాయి సిబ్బందితో గురువారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఈ నెల 23 నుండి 31వ తారీఖు వరకు మహిళా స్వయం సహాయక పొదుపు సంఘాలకు వైఎస్ఆర్ ఆసరా పథకం కింద 4వ విడత ఆర్థిక సహాయం, ఫిబ్రవరి నెల 5 నుండి 14వ తారీఖు వరకు వైఎస్ఆర్ చేయూత పథకం కింద 4వ సంవత్సరం ఆర్థిక సహాయం అందించనున్నామన్నారు. కార్యక్రమాల్లో లబ్ధిదారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొనేలా చూడాలని, ప్రభుత్వం ఆదేశాల మేరకు 8 రోజులకు ఒక షెడ్యూల్ తయారు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాలు ప్రీ లాంచ్, లాంచ్ డే, పోస్ట్ లాంచ్ మూడు దశల్లో జరుగుతాయన్నారు. ఈ మేరకు క్షేత్రస్థాయిలో షెడ్యూలు పై లబ్ధిదారులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో ఎంపిపి సండి సోమేశ్వరరావు, జెడ్‌పిటిసి ఎమ్.వెంకటలక్ష్మి, వైస్ ఎంపిపి ఇందుకూరి సుధారాజు, ఎస్‌కోట మేజర్ పంచాయితీ సర్పంచ్ జి.సంతోషికుమారి, ఎంపిడిఒ శేషుబాబు, వెలుగు ఏరియా కో-ఆర్డినేటర్ ఆదియ్య, ఎపిఎం సురేష్ కుమార్, పలువురు సిసిలు, విఒఎలు పాల్గొన్నారు.

భూములను అమ్ముకునేందుకు వైసిపి కుట్ర

ప్రజాశక్తి- శృంగవరపుకోట

రికార్డులను తారుమారు చేసి భూములను అమ్ముకునేందుకు వైసిపి ప్రభుత్వం కుట్ర పన్నుతోందని టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి కోళ్ల లలితకుమారి ఆరోపించారు. మండల కేంద్రంలోని అన్న క్యాంటీన్ వద్ద గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. మన భూమి పాస్ బుక్ మీద జగన్ బొమ్మ ఎందుకని ? మన భూముల రికార్డులను తారుమారు చేసి, వాటిని అమ్ముకునేందుకు వైసిపి ప్రభుత్వం కుట్ర చేస్తుందని, భూ హక్కు చట్టం అమలైతే అనేక ఇబ్బందులు వస్తాయని, వాటిని కూడా ఈ అవినీతి ముఖ్యమంత్రి తాకట్టు పెట్టి రుణాలు తెస్తాడని తెలిపారు. ఐదేళ్ల పాలనలో యువత నిరుద్యోగులుగా మారారని, రాష్ట్రానికి పరిశ్రమలు ఒక్కటి కూడా రాకపోగా, ముందుగా ఉన్న పరిశ్రమలు ఒక్కొక్కటిగా వైసిపి నాయకుల అవినీతికి తరలిపోయాయని ఆరోపించారు. ఏటా జనవరిలో జాబ్ క్యాలెండర్, మెగా డిఎస్‌సి అని నమ్మబలికి ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదని గుర్తు చేశారు. యువత టిడిపి -జనసేన జెండా పట్టుకుని యువతలో చైతన్యం తీసుకురావాలని, యువత కోసం పరిశ్రమలు తీసుకువచ్చి, ఉద్యోగాలు ఇచ్చే భాద్యత టిడిపి తీసుకుంటుందని ఆమె అన్నారు. సమావేశంలో టిడిపి మండల అధ్యక్షులు జిఎస్ నాయుడు, రెడ్డి వెంకన్న, నానిగిరి రమణాజీ, భీశెట్టి అరుణ, బోనంగి జ్యోతి, మల్లేశ్వరరావు, పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఆడుదాం ఆంధ్ర

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు మండల స్థాయిలో గురువారం కొనసాగాయి. నగర పంచాయతీ పరిధి థామస్‌పేట ఫుట్ బాల్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న ఈ పోటీలను కమిషనర్ బాలాజీ ప్రసాద్, ఎంఇఒలు యు. సూర్య నారాయణ, ఈ.విజయ్ కుమార్, ఇఒపిఆర్‌డి కె.సింహాద్రి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పిఇటి ఎన్. సూర్యనారాయణ, మండల ఇంచార్జ్ పిడిఎస్. సూర్యరావు, పిఇటిలు, పీడీలు, నగర పంచాయతీ సిబ్బంది, వార్డు సెక్రెటరీలు,పాల్గొన్నారు.

శృంగవరపుకోట: మండలంలోని భవాని నగర్ వద్ద గల డాక్టర్ వరలక్ష్మీ స్కూల్లో ఆడుదాం ఆంధ్రలో భాగంగా గురువారం నిర్వహించిన మండల స్థాయి వాలీబాల్, కబడ్డి, ఖోఖో పోటీలు సెమీ ఫైనల్స్‌కు చేరుకున్నాయని ఎస్‌కోట మండల క్రీడా కోఆర్డినేటర్ డాక్టర్ పొట్నూరు శ్రీరాములు తెలిపారు. ఫైనల్స్ 12వతేది ఉదయం ప్రారంభమవుతాయని అన్నారు. పట్టణంలోని ఆఫీసర్స్ క్లబ్‌లో నిర్వహిస్తున్న బ్యాడ్మింటన్ పోటీలు సెమీఫైనల్స్‌కు చేరుకున్నాయని ఫైనల్స్ శుక్రవారం ప్రారంభమవుతాయని శ్రీరాములు తెలిపారు. డాక్టర్ వరలక్ష్మి స్కూల్లో వాలీబాల్ క్రీడాకారులను వరలక్ష్మి ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజ్ ప్రిన్సిపాల్ ఎ.భార్గవ్‌రామ్ పరిచయం చేసుకొని అభినందించారు.

భోగాపురం: మండలంలో ఆడుదాం ఆంధ్ర మండల స్థాయి క్రీడా పోటీలు గురువారం హోరాహోరీగా జరిగాయి. భోగాపురం, దల్లిపేట, గుడివాడ, రావాడ గ్రామాల్లోని మైదానాల్లో జరిగిన పోటీల్లో గెలుపొందిన జట్లు నియోజకవర్గ స్థాయిలో పోటీ పడతాయి. ఈ సందర్భంగా వైసిపి మండల నాయకులు ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి, ఎంపిడిఒ అప్పలనాయుడు ఈ పోటీలను పర్యవేక్షించారు. మండల స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులకు ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి తన సొంత సొమ్ముతో మెమొంటోలను శుక్రవారం అందజేయనున్నారు.

క్రికెట్ పోటీలను ప్రారంభించిన 'గొంప'

ప్రజాశక్తి- శృంగవరపుకోట

టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ ఆధ్వర్యంలో పట్టణంలోని ఆకుల డిపో వద్ద నియోజకవర్గ పరిధిలో నిర్వహిస్తున్న ఎస్‌కోట ప్రీమియర్ లీగ్ (ఎస్‌పిఎల్) క్రికెట్ పోటీలను గురువారం గొంప కృష్ణ ప్రారంభించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14వ తేదీ వరకు జరగనున్న ఈ క్రికెట్ మ్యాచ్‌లో మొత్తం ఎనిమిది టీమ్‌లు పాల్గొంటున్నాయన్నారు. ఇందులో భాగంగా గురువారం మొదటి మ్యాచ్‌గా రైల్వే స్టార్స్, త్రిబులెస్ లెవెల్స్ తలబడనున్నాయన్నారు. ఈ క్రికెట్ మ్యాచ్‌లో గెలుపొందిన వారికి మొదటి బహుమతిగా టీమ్‌కు రూ.50 వేలు, రెండవ స్థానంలో ఉన్న వారికి రూ.35వేలు ప్రైజ్ మనీ ఇస్తామన్నారు. బెస్ట్ బ్యాట్స్‌మెన్, బెస్ట్ బౌలర్, మ్యాన్ ఆఫ్ ద సిరీస్, మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌కు ప్రత్యేక ప్రైజ్ మనీ ఇస్తామన్నారు. యువతను క్రీడల వైపు ప్రోత్సహించేందుకే ఇటువంటి పోటీలను నిర్వహిస్తున్నామని వెల్లడించారు. రానున్న రోజుల్లో వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్ వంటి క్రీడలను కూడా నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న గొంప కృష్ణ

ఇది మూర్ఖత్వపు ప్రభుత్వం

ప్రజాశక్తి-విజయనగరం కోట

రాష్ట్రంలో మూర్ఖత్వపు పాలన సాగుతోందని విజయనగరం పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కిమిడి నాగార్జున, నియోజకవర్గ ఇన్‌ఛార్జి అతిథి గజపతి అన్నారు. ప్రజలపై భారాలు వేస్తూ, అనేక రంగాల వారి సమస్యలు పరిష్కరించకుండా శాడిస్ట్ ప్రభుత్వంలా వ్యవహరిస్తోందని అన్నారు. బొబ్బిలిలో జరిగిన రా కదలిరా కార్యక్రమాన్ని విజయవంతం చేసిన టిడిపి, జనసేన కార్యకర్తలకు, నాయకులకు, ప్రజలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. గురువారం అశోక్‌బంగ్లాలో వారు విలేకర్లతో మాట్లాడారు. జనసేన, టిడిపి కలయికలో ప్రభుత్వం కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గత నాలుగు చేసిన అభివృద్ధి ఏమీ లేదని, కొత్తగా తీసుకువచ్చిన మౌలిక సదుపాయాలు కూడా ఏమీ లేవన్నారు. కనీసం రిజర్వాయర్లకు మరమ్మత్తులు చేసుకోలేకపోతున్నారన్నారు. ప్రజలందరికీ రాబోయే రోజులన్నీ మంచివే అన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, పట్టణ అధ్యక్షులు ప్రసాద్ లక్ష్మీ వరప్రసాద్, మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నరసింగరావు, కనకల మురళీమోహన్, బంగారు బాబు, కంది మురళి నాయుడు, కోండ్రు శ్రీనివాస్, భరత్ అనే నాయకులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

భోగాపురం: మండలంలోని గుడివాడ గ్రామ సమీపంలో పేకాట శిబిరంపై స్థానిక పోలీసులు బుధవారం రాత్రి దాడి చేశారు. ఇక్కడ పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో స్థానిక ఎస్‌ఐ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో దాడి చేసి పట్టుకున్నారు. సుమారు రూ.45వేలు నగదు, ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు.

బాడంగి: మండలంలోని వీరసాగరం సమీపంలో ఆరుగురు జూదగాళ్లను అరెస్టు చేశామని ఎస్‌ఐ జయంతి తెలిపారు. పేకాటాడుతున్నట్లు తమకు వచ్చిన సమాచారం మేరకు ఊరు చివరిలో రైడ్ చేశామని వారి వద్ద నుంచి రూ.15,130 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

అక్రమ మద్యం పట్టివేత

ప్రజాశక్తి- నెల్లిమర్ల

మండలంలోని జోగిరాజు పేటలో 50 అక్రమ మద్యం బాటిళ్లను పట్టుకున్నట్లు ఎస్‌ఐ నారాయణరావు గురువారం తెలిపారు. గ్రామంలో అక్రమ మద్యం అమ్మకాలపై సమాచారం అందడంతో దాడి చేసి పట్టుకున్నామన్నారు. పట్టుబడిన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని నిందితున్ని పోలీసు స్టేషన్‌కి తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.